క్లుప్తంగా

ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యం

గూడూరు: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కప్పలదొడ్డి సర్పంచి యక్కల మాధవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ పేరిశెట్టి తేజోవతి పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

మచిలీపట్నంటౌన్: పలు డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలు, గర్భిణులకు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు శుక్రవారం అందజేశారు. కార్పొరేటర్లు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.

6న ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నంటౌన్: జీబీఆర్ ఫౌండేషన్, ప్రజారోగ్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన బుట్టాయిపేటలోని జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకుడు పామర్తి నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శిబిరం జరుగుతుందని చెప్పారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ గోపాలం శివన్నారాయణ, బీఆర్‌కే ప్రసాద్, పి. సురేష్‌చంద్రారెడ్డి, రావి శ్రీనివాసరావు, కుప్పా రామశాస్త్రి, పద్మావతి, శంకరానంద్, మానసాదేవి పాల్గొని రోగులకు వైద్య సేవలు అందిస్తారని చెప్పారు.

గుంటూరు వెళ్లి పింఛను అందజేత

మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్ కుమ్మరిగూడెంకు చెందిన పెదపూడి నాగేశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ బాకూరి అజయ్ ఆస్పత్రికి వెళ్లి నాగేశ్వరమ్మకు పింఛను సొమ్మును అందించాడు. లబ్ధిదారు నాగేశ్వరమ్మ కృతజ్ఞతలు తెలిపింది. వలంటీర్‌ను కార్పొరేటర్, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు అభినందించారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ ముస్లిం సంక్షేమ సంఘం నాయకుడు సదురుద్దీన్ ఖురేషి అన్నారు. శుక్రవారం నగరంలోని ఇనుగుదురుపేటలో వలంటీర్లు లబ్ధిదారులకు చేస్తున్న సేవలను కొనియాడుతూ వారి ఫొటోలకు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. వలంటీర్లకు ఆయన అభినందనలు తెలిపారు. ముస్లిం పెద్దలు ఎండీ మునీర్‌మౌలానా, నాసిర్‌సాహెబ్, హఫీజ్, ఆదిల్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

కోనేరుసెంటర్: రైతులు పండించే పంటలకు సంబంధించి వీఏఏలు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్. పద్మావతి అన్నారు. మచిలీపట్నం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఏడీఏ జీవీ శ్రీనివాసరావు, మచిలీపట్నం, పెడన మండల వ్యవసాయ శాఖాధికారులు, వీఏఏలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

చల్లపల్లి: మృతుని కుటుంబానికి కేవలం ఆరు గంటల్లోనే వైఎస్సార్ బీమా మంజూరైంది. గ్రామానికి చెందిన చెంబురెడ్డి సాయిబాబు శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబానికి చల్లపల్లి గ్రామ సచివాలయం-1 వెల్ఫేర్ అసిస్టెంట్ పరిశె దేవా ఆరు గంటల్లోనే వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయం కింద రూ.10 వేలు మంజూరయ్యేలా చేశారు. మృతుడి భార్య లక్ష్మీకి ఈ సహాయాన్ని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ దేవా అందజేశారు.

హర్యానా ఘటనలపై అఖిలపక్షం నిరసన

చల్లపల్లి: మణిపూర్ మారణకాండ మంటలు చల్లారక ముందే బీజేపీ హర్యానాలో చిచ్చు పెట్టిందని సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రధాన కూడలిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మహమ్మద్ కమాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీర్ రిజ్వాన్, సీపీఎం నాయకులు వాకా రామచంద్రరావు, సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరిముల్లా, పలు పార్టీలు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

ఉత్తరచిరువోలులంక (మోపిదేవి): మండల పరిధిలోని ఉత్తర చిరువోలులంక గ్రామంలో గురువారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై మోపిదేవి ఎస్‌ఐ సీహెచ్ పద్మ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 34,210 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ పద్మ మాట్లాడుతూ పేకాట, జూదాలను సహించేది లేదని హెచ్చరించారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..రైతులకు శాపం

- వంతెన నిర్మాణం పూర్తయినా తొలగించని కర్రలు, మట్టి
- నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన వైనం
- పట్టించుకోని కాంట్రాక్టర్
- ముంపులోనే వరి పొలాలు
- రైతుల ఆందోళన



లజ్జబండ మేజర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన మట్టి దిబ్బలు



డ్రెయిన్ సమీపంలోని పంట పొలాల్లో నిలిచిన మురుగు నీరు

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు శివారు లజ్జబండ మేజర్ డ్రెయిన్‌పై వంతెన నిర్మించిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వంతెన నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు కర్రలు పాతి మట్టిని అధికంగా పోశారు. పనులు పూర్తయి వంతెన ప్రారంభమై రాకపోకలు సాగుతున్నా.. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న కర్రలను, మట్టిని కాంట్రాక్టర్ తొలగించలేదు. ఇదే రైతులకు శాపంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు పారుదల కాక పొలాలు ముంపునకు గురయ్యాయి. వర్షాలు ఆగిపోయి వారం అవుతున్నా మురుగు పారుదల లేక నేటికీ ముంపులోనే పొలాలు ఉన్నాయి.

వేలాది ఎకరాలకు ఆధారం..

216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ముంజులూరు గ్రామ సమీపంలోని లజ్జబండ మేజర్ డ్రెయిన్‌పై కాంట్రాక్టర్ పెద్ద వంతెన నిర్మించాడు. ఈ డ్రెయిన్‌పై గూడూరు, పెడన, బంటుమిల్లి మండలాల్లోని వేలాది ఎకరాల భూములు, మీడియం, మైనర్ డ్రెయిన్లు పెద్ద ఎత్తున ఆధారపడి ఉన్నాయి. ఎగువ నుంచి వచ్చే మురుగు నీరు ఈ డ్రెయిన్ గుండా వెళ్లి సుమారు 10 కి.మీ దూరంలోని సముద్రంలో కలుస్తోంది. గూడూరు, పెడన మండలాల్లోని మైనర్, మీడియం డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే జోగి రమేష్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు పెద్దఎత్తున చేపట్టారు. దీంతో ఎగువ నుంచి పెద్దఎత్తున మురుగు నీరు డ్రెయిన్‌లోకి వస్తోంది. దీనికి తోడు ప్రతి రోజూ సముద్రపు ఆటు-పోటు ప్రభావం నీటి ప్రవాహానికి పెద్ద అడ్డంకిగా మారింది.

నీటి ప్రవాహానికి అడ్డంకి..

216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వంతెన నిర్మాణ సమయంలో కర్రలు, మట్టితో అడ్డుకట్ట వేసి సెంట్రింగ్ ఏర్పాటు చేశాడు. నిర్మాణం పూర్తయి వంతెనపై రాకపోకలు సాగుతున్నా వంతెన కింద ఏర్పాటు చేసిన కర్రలు, మట్టి తీయకపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మురుగు నీరు ఇప్పటికీ కిందకు పారుతూనే ఉంది. డ్రెయిన్‌లో ఉన్న మట్టి దిబ్బల కారణంగా ప్రవాహం నెమ్మదిగా పారుతున్నందున డ్రెయిన్ పరీవాహక భూముల్లోని నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి కొల్లేరును తలపిస్తోంది. వర్షాలు నిలిచిపోయి వారం రోజులు అవుతున్నా ముంజులూరు, కంచడం తదితర గ్రామాల్లోని పంట పొలాలు మాత్రం చెరువులను తలపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది సార్వా సాగు ప్రశ్నార్థకమేనని రైతులు వాపోతున్నారు. మా ఇబ్బందులను గుత్తేదారు సంస్థ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ డ్రెయిన్ పక్కనే భూములున్నా వాటిల్లో నీరు నేటికీ బయటకు పోకపోవడానికి సంస్థ అధికారుల నిర్లక్ష్యమే కారణమని, ఇదే రైతులను నిండా ముంచిందని ముంజులూరు, కంచడం రైతులు ఆరోపించారు. ఈ విషయాన్ని రైతులు ఎమ్మెల్యే జోగి రమేష్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని చెబుతున్నారు.

నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు

లజ్జబండ డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనకు ఏర్పాటు చేసిన అడ్డంకులు తొలగించాలని కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యం వహించారు. పాత, కొత్త వంతెనల మధ్య మట్టి దిబ్బలున్న విషయం తెలుసు. పై నుంచి డ్రెయిన్లలో అడ్డంకులు తొలగిస్తున్నాం. అనంతరం లజ్జబండ డ్రెయిన్‌లో అడ్డంకులు తొలగిస్తాం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ మురళీకృష్ణ, ఏఈఈ డ్రెయినేజీ, పెడన సెక్షన్



తొలగించాలని కోరినా ఫలితం లేదు

వంతెన కింద కాంట్రాక్టర్ పెట్టిన మట్టి, కర్రలు తొలగించాలని సంస్థ అధికారులకు అనేకసార్లు కోరా. వారు రైతుల మాటలను పట్టించుకోలేదు. వారి నిర్లక్ష్యం మా భూములను నీటిపాలు చేసి సార్వా సాగుకు పనికిరాకుండా చేసింది. వర్షాలు ఆగిపోయినా పొలాల్లో ఇంకా రెండు అడుగుల మేర నీరు నిల్వ ఉంది. మా పొలాలు నీటిపాలు కావడానికి పూర్తిగా 216 రహదారి నిర్మాణ సంస్థ బాధ్యత వహించాలి, నష్ట పరిహారం ఇవ్వాలి.

– సత్యనారాయణమూర్తి, రైతు, ముంజులూరు

జగన్ పాలనలో అన్ని కుటుంబాలకు మేలు

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు మేలులు జరిగాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 26వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని గడప గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు చేశారన్నారు. ఫలితంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అన్ని విధాలుగా మేలులు జరిగాయని వివరించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీలు, నాయకులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పేర్ని కిట్టు

పేదలను ఆదరించడమే జగన్‌కు తెలిసిన రాజకీయం

- మంత్రి జోగి రమేష్
- గరిశపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



గ్రామస్తులకు బ్రోచర్ అందజేసి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: పేద ప్రజలను ఆదుకోవడం.. వారి కుటుంబాల్లో సంతోషం నింపడం.. ఇదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసిన రాజకీయమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గరిశపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లిన మంత్రి ముందుగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన పథకాల లబ్ధిని వివరించారు.

మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని చెప్పారు. నిరుపేద కుటుంబాల్లోని పిల్లల ఉన్నత విద్యాభివృద్ధికి జగనన్న నాడు-నేడు పథకంతో పాఠశాలల అభివృద్ధి, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, చదువుకునే పుస్తకాలే కాకుండా జగన్న విద్యా కానుక పేరుతో బ్యాగ్, షూస్, బెల్టు ఇలా అన్నీ సమకూర్చి మన పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగేలా చేసిన ఘనత జగనన్నదేనని చెప్పారు. ప్రతి కుటుంబానికి లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. మీ ఇంటిలో మీకు జగనన్న మేలు చేశారని భావిస్తే ఆయనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అంబేడ్కర్ నగర్‌లో ప్రాథమిక పాఠశాల ఆవరణ పల్లం కావడంతో వర్షం నీరు నిల్వ ఉండి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా పాఠశాల ఆవరణ మెరక చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. శీతనపల్లి మెగా స్కీం నుంచి వచ్చే తాగునీరు కలుషితం కాకుండా పూర్తి స్థాయిలో అందే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ నాగార్జున, ఎంపీటీసీ పోతురాజు, బాబూరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, డీటీ శశికుమార్, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక పద్మావతి మహిళా హిందూ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ర్యాగింగ్ చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారన్నారు.

తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలుగుతూ విద్యను ప్రోత్సహించే విధంగా వారికి సహకరించాలని చెప్పారు. దిశ యాప్‌తో మహిళలకు రక్షణ కలుగుతుందన్నారు. యాప్ ఉపయోగాలను వివరించారు. యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. అన్నపూర్ణ, ఎల్. గోపీనాథ్, ఎం. వెంకటవాహిని, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణా పూర్వ కలెక్టర్ లక్ష్మీకాంతానికి పురస్కారం



ఇంద్రధనుస్సు పద్యకావ్యాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీకాంతం, బుద్ధప్రసాద్, శ్యామలానంద ప్రసాద్

అవనిగడ్డ: దివంగత మంత్రి మండలి వెంకట కృష్ణారావు (ఎంవీకేఆర్) స్మారక పురస్కారాన్ని ఉమ్మడి కృష్ణా పూర్వ కలెక్టర్ లక్ష్మీకాంతం అందుకున్నారు. స్థానిక గాంధీక్షేత్రం ఆవరణలో మండలి వెంకట కృష్ణారావు 98వ జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాంధీక్షేత్రం కమిటీ, మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మీకాంతం మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి మండలి వెంకట కృష్ణారావు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ లక్ష్మీకాంతం దివిసీమ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత తేజోమూర్తుల వెంకటేశ్వరరావు రచించిన ఇంద్రధనుస్సు పద్యాకావ్యాన్ని లక్ష్మీకాంతం, బుద్ధప్రసాద్, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఆవిష్కరించారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



చెన్నూరులో పోషణ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ వాణి

కృత్తివెన్ను: బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలను మించిన శ్రేష్టమైన ఆహారం మరొకటి లేదని, తల్లిపాలే బిడ్డకు పూర్తి రక్షణ అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరీశ్యామల అన్నారు. కృత్తివెన్ను పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు అన్నీ కలిసి కృత్తివెన్నులో తల్లిపాల వారోత్సవాలను జరుపుకున్నాయి. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం వినియోగం, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డపుట్టిన అరగంటలోపే ముర్రుపాలను బిడ్డకు తాగించాలని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరునెలల పాటు బిడ్డకు తల్లిపాలను తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. అనంతరం పలువురికి టీహెచ్‌ఆర్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, ఎంపీటీసీ విజయకుమారి, శేఖర్ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం..

గూడూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టాలని గూడూరు సీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అరుణ కాత్యాయని అన్నారు. మచిలీపట్నం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాతా శిశు సంక్షేమం అవగాహన సదస్సు నిర్వహించారు. అరుణ కాత్యాయని మాట్లాడుతూ శిశువు ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింప చేయవచ్చన్నారు. 6 నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు లింగం మోజెస్, కార్యదర్శి అనుపమ ముఖర్జీ, సర్పంచి సులోచనారాణి, హెడ్ నర్స్ డి.భారతి తదితరులు పాల్గొన్నారు.

పెడన: తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. బంటుమిల్లి ప్రాజెక్టు పరిధిలోని పెడన మండలం, చెన్నూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాలింతలకు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆమె అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బంటుమిల్లి ప్రాజెక్టు సీడీపీఓ ఎం. సముద్రవేణి, ఏసీడీపీఓ సుధారాణి, మాజీ ఎంపీపీ ఆర్. అచ్యుతరావు, చేవేంద్ర పీహెచ్‌సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: ఎస్‌ఎన్ గొల్లపాలెంలో శుక్రవారం గ్రామంలోని బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను మాజీ సర్పంచ్ మట్టా మోహన నాంచారయ్య అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాంచారమ్మ, శశికళ, మహిళా పోలీస్ అనుపమ, హెల్త్ అసిస్టెంట్ రమ్య పాల్గొన్నారు.

బంటుమిల్లి: మల్లేశ్వరం గ్రామ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ, పోషణ కిట్లను ఎంపీటీసీ పి. వీరబాబు అందజేశారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రామానగరంలో భారీ చోరీ

చల్లపల్లి: చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. గ్రామంలోని బోలెం సుబ్బారావు ఇంటిలో దొంగలు పడి బంగారు వస్తువులను అపహరించారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బోలెం సుబ్బారావు, కుటుంబ సభ్యులు పశువుల చావిడి వద్దకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. పశువుల చావిడి నుంచి తిరిగి ఇంటి వచ్చిన బోలెం సుబ్బారావు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా పడక గదిలోని బీరువాల్లో దాచుకున్న 146 గ్రాముల బంగారు ఉంగరాలు, నెక్లెస్, చైన్లు, గాజులు, ముక్కు పుడకలు, బంగారం బిస్కెట్ ముక్క కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, చల్లపల్లి ఎస్‌ఐ సీహెచ్ చినబాబు తన సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, చల్లపల్లి సీఐ బి.భీమేశ్వర రవికుమార్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారం

కోసూరువారిపాలెం(మోపిదేవి): ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తక్షణం స్పందిస్తోందని డీఎల్‌పీఓ ఐ. జ్యోతిర్మయి అన్నారు. మండల పరిధిలోని కోసూరువారిపాలెం దళితవాడలో దాసి శ్రీనివాసరావు డ్రెయినేజీ సమస్యపై స్పందనలో పెట్టిన అర్జీకి అధికారులు స్పందించి శుక్రవారం సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఒకసారి పరిష్కరించామని, మరోసారి ఈఓపీఆర్డీ లాగిన్‌లోకి రావడంతో ఫిర్యాదుదారుని కోరిక మేరకు పూర్తిస్థాయిలో డ్రెయినేజీ తవ్వించి సమస్య పరిష్కారం అయినట్లు లెటర్ కూడా తీసుకున్నామని వివరించారు.

సచివాలయాల సందర్శన..

మండలంలోని మోపిదేవి, నాగాయితిప్ప గ్రామ సచివాలయాలను డీఎల్‌డీఓ పద్మజ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ కార్యదర్శులు కమ్మిలి త్రిపుర సుందరి, ఉప్పాల వెంకటేశ్వరరావు, కె. రామకోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ పనులు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 26వ డివిజన్‌లో సిమెంట్ రోడ్లు, పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం ప్రారంభించారు. జవ్వారుపేటలోని టిక్యా రోడ్డు 73 గజాల మేర సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసి పక్కా డ్రెయిన్ నిర్మించనున్నారు. రూ. 7 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో సిమెంట్ రోడ్డు, డ్రెయిన్ అభివృద్ధి చేయాలని కోరుతున్నారన్నారు. దీనిలో భాగంగా మునిసిపల్ సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ కౌన్సిలర్ మాడపాటి వెంకటేశ్వరరావు, చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. తొలుత పేర్ని కిట్టు నాయకులతో కలిసి టిక్యాలోని దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

గూడూరు: రైతులు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా రైతు భరోసా కేంద్రాలు పని చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు అన్నారు. మల్లవోలులోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం జరిగిన గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులకు ఎన్నో మేలులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం నిర్వహించే గ్రామ స్థాయి సలహా మండలి సమావేశంలో రైతులంతా తమ సమస్యలు చర్చించుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మల్లవోలు ఆయకట్టుకు సంబంధించి పంట కాలువలు, డ్రెయినేజీ వ్యవస్థలను బాగు చేయడానికి చొరవ తీసుకోవాలని కోరారు. గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్లం పెద బాబు, సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఆర్బీకే చైర్మన్ హరినాథ్‌బాబు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.పద్మావతి పాల్గొన్నారు.

అక్రమ చెరువుల తవ్వకం.. మూడు పొక్లెయిన్ల సీజ్

నాగాయలంక: ఎదురుమొండి రెవెన్యూ పరిధి ఏటిమొగ పంటు సమీపంలో కృష్ణానది ఒడ్డున విస్తరించిన మడచెట్లను తొలగించి ఆ భూముల్లో అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వుతుండగా నాగాయలంక తహసీల్దార్ జె.విమలకుమారి శుక్రవారం అడ్డుకున్నారు. మూడు పొక్లెయిన్‌లను సీజ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం అందిన సమాచారం మేరకు ఆర్‌ఐ ఎన్. సందగీతసారథి, వీఆర్వో భిక్షంలతో కలిసి తహసీల్దార్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. అక్కడ తవ్వకాలు చేస్తున్న ఏటిమొగ గ్రామానికి చెందిన నాయుడు నాగ బసవయ్యకు చెందిన మూడు పొక్లెయిన్‌లను సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

పురుగులను నివారించండి

మచిలీపట్నంటౌన్: ఐదో డివిజన్ పరిధిలో సీడబ్ల్యూసీ గోడౌన్‌లో నిల్వ ఉంచిన ఆహారధాన్యాలకు పింక్ పురుగులు వ్యాప్తి చెందకుండా నివారణకు చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి వేముల వనబాబు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సీడబ్ల్యూసీ గోడౌన్ అధికారులతో కలిసి మాట్లాడారు. పురుగులు వ్యాప్తి చెందటం వల్ల కలిగే ఇబ్బందులను ఆయన వివరించారు. తక్షణమే వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

- **అవనిగడ్డ:** మోపిదేవి మండలం చిరువోలులో జరిగిన అగ్నిప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన నాదెళ్ల సుబ్రహ్మణ్యం కుటుంబానికి వైఎస్సార్ సీపీ యువ నేత సింహాద్రి వికాస్ చేతుల మీదుగా నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ విశ్వంశెట్టి మొగలేశ్వరి గుప్తా ఆర్థిక సహాయం అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983, 99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com